ఆదివారం
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
13.4.2025

## క్రైస్తవులకు పవిత్రమైన

# పామ్ సండే



## చైర్మన్‌తో ముఖాముఖి



ముకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, సూర్య తెలుగు దిన పత్రిక

**కాంగ్రెస్ పార్టీ తాజాగా మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. రోజురోజుకూ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతున్న నేపథ్యంలో ఆ పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్ఠానం విశ్వప్రయత్నాలు చేస్తుంటే పార్టీ సీనియర్లు ఒక్కొక్కరిగా పార్టీని వీడుతుండటం కలవర పరిచేదే. ఇప్పటికే పలువరు సీనియర్లు మరికొన్ని రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోనున్న సమయంలో ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ రాజీనామా చేసి అందర్నీ విస్మయానికి గురిచేసిందనటంలో సందేహం లేదు. మీరేమంటారు?**

**– కె లలిత, కొయ్యూరు, విశాఖపట్నం**

అవును లలితగారూ... మీరన్నది నిజమే... కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు అనుభవించిన వ్యక్తులు ఈ మధ్య కాలంలో అందునా అష్టకష్టాలు పడుతున్న తరుణంలో పార్టీని వీడి పోవటంతో పాటు పార్టీపై విమర్శల పరం పరని గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే జమ్ము కాశ్మీర్‌లో కీలక వ్యక్తిగా కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులందుకున్న గులాంనబీ ఆజాద్ రాజీనామా చేయటం ఒకింత ఆశ్చర్య కలిగించేదే.. ఆయన పార్టీ పదవులతో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా ఆయన రాజీనామా చేశానని ప్రకటించారు.. గతంలో రాజ్యసభ విపక్ష నేతగా, కేంద్రమంత్రిగా గులాంనబీ ఆజాద్ పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రానికి కూడా ఆయన ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. 2005-2008 వరకు జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా గులాంనబీ ఆజాద్ పనిచేశారు.
రాజీనామా పత్రాన్ని ఆజాద్ సోనియా గాంధీకి పంపారు. రాహుల్ గాంధీ తీరుపై రాజీనామా లేఖలో తప్పుబట్టారు. రాహుల్ గాంధీకి రాజకీయ పరిపక్వత లేదని, ఆయనది చిన్నపిల్లల మనస్తత్వం అంటూ లేఖలో పేర్కొన్నారు. పార్టీలో సీనియర్లకు ఆదరణ లేకుండా పోయిందని.. రాహుల్ గాంధీ ఉపాధ్యక్షుడు అయ్యాక పార్టీ నాశనమై పోయిందని ఆజాద్ ఆవేదన వ్యక్తం చేశారు. హైకండ్ తీరుకు తీవ్ర అసంతృప్తికి గురయ్యాయని.. ఈ కారణంతోనే రాజీనామా చేస్తున్నట్లు ఆజాద్ లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌తో ఉన్న 50 ఏళ్ల అనుబంధం వదులుకోవడం చాలా బాధాకరం అంటూ ఆజాద్ ఆవేదనతో లేఖలో పేర్కొన్నారు. అయితే గత కొంత కాలంగా గులాం పార్టీని వీడి బిజేపిలో చేరుతున్నారన్న కథనాలు బాగానే మీడియాలో ప్రచారంలో ఉన్నాయి. ఓ వేళ ఆయన బిజేపిలో చేరితే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలపనున్నారంటూ ప్రచారం జరిగింది. అయితే ఆ కథనాలేవీ వాస్తవం రూపం దాల్చని క్రమంలో ఆయన కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశాలున్నాయనిపించింది. కానీ ఆయన పార్టీ సమావేశాలకు ఒకింత అయిష్టంతోనే హాజరువుతుండం, ఎప్పటిక ప్పుడు తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తీకరిస్తుండటం చూస్తే... ఏదో ఓ రోజు కాంగ్రెస్‌కు ఆజాద్ గుడ్‌బై తప్పని సరి అనిపించింది. ఇప్పటికే పలువురు కమలం పార్టీ నేతలతో ఆయన టచ్‌లో ఉన్నారన్న ఆరోపణల క్రమంలో ఆయన కాంగ్రెస్‌ని వీడటం నాకైతే ఆశ్చర్యం అనిపించలేదు.


**దేశ వ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాలలో అధికారం చేజిక్కించుకునే లక్ష్యంతో పనిచేస్తున్న బిజేపికి కొన్ని రాష్ట్రాలు మింగుడు పడక పోవటంతో ఆ యా రాష్ట్రాలలో పాలక పార్టీలను చీల్చేందుకు సన్నాహాలు చేసుకుంటూ ఉంటుంది. అవసరమైతే షిండేలూ పుట్టుకొస్తారని ఆ పార్టీ నేతలు ప్రకటిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ పీఠం దక్కించుకునేందుకు కమల నాథులు చేయని ప్రయత్నం లేదు. ఓటమి చవిచూసినా మాదే పైచేయి అని చెప్పుకునేందుకు ఎమ్మెల్యేలను కొనుగోళ్లు చేస్తుంటారన్న ఆరోపణలు ఎలానూ ఉండనే ఉన్నాయి. గత 8 ఎళ్లలో మోడీ చేసింది కూడా ఇదే అన్నది వాస్తవమే. మరి ఢిల్లీ కేజ్రీవాల్ ప్రభుత్వం కూలగొట్టే పని బిజేపి చేస్తోందన్నది ఇప్పుడు ప్రధాన ఆరోపణ. మరి రెండేళ్లలో ఎన్నికలు పెట్టుకుని బిజేపి ఆ పనికి ఒడిగడుతుందంటారా?**

**– పెంకి చంద్ర జీవన్ ,హైదరాబాద్**

మీరన్నది నిజమే జీవన్ గారూ... ఈ మధ్య కాలంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీజేపీకి 40 మంది ఎమ్మెల్యేలు అవసరమని, దానిని సాధించడానికి 800 కోట్ల రూపాయలు సిద్ధం చేసుకుందని సీబీఐ దాడులు జరిగిన ఒక రోజు తర్వాత సిసోడియాకి బీజేపీ సీఎం పదవిని ఆఫర్ చేసింది. అయిత సీఎం పదవిపై ఆశ లేని మనీష్ సిసోడియా ఆప్‌లో ఉండటం మా అదృష్టం. ఆప్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోవడం కంటే చనిపోతారు. బీజేపీ ఆపరేషన్ లోటస్ విఫలమవ్వాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు మహాత్మాగాంధీ మెమోరియల్‌ను సందర్శించారు. పార్టీ మారితే ఒక్కొక్క ఎమ్మెల్యేకు రూ.20 కోట్ల చొప్పున ఇస్తామని బీజేపీ ఆశపెడుతోందని ఆప్ ఆరోపించింది. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో జరిగిన సమావేశంలో 62 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నట్లు తెలుస్తుంది. అందులో 12 మంది పార్టీ నుంచి వైదొలగడానికి బీజేపీకి చెందిన వారు సంప్రదించారని చెప్పినట్లు తెలుస్తుంది. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ తాము తుది శ్వాస వరకు పార్టీతోనే ఉంటామని ఎమ్మెల్యేలందరూ చెప్పారని తెలిపారు. అయితే బీజేపీ మాత్రం ఈ ఆరోపణలను కొట్టిపడేయటం గమనార్హం.

## లెజెండ్

# మహాత్ముని అంతరంగికుడు మహదేవ్ దేశాయ్



MAHADEV DESAI
(1 JANUARY 1892 – 15 AUGUST 1942)
Gandhian Activist

జాతిపిత మహాత్మాగాంధీ సేవ కోసం సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి మహదేవ్ దేశాయ్. నిజానికి గాంధీకి అంతరంగికుడు. ఆయన లేకుండా మహాత్ముని జీవితం గురించి సంపూర్ణంగా తెలిసేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన మహాత్మా గాంధీ వ్యక్తిగత కార్యదర్శి. గాంధీకి సంబంధించిన ప్రతి విషయం స్వయంగా దేశాయే చూసేవారు.
మహదేవ్ దేశాయ్ (1 జనవరి 1892%--% 15 ఆగస్టు 1942) 1892 జనవరి 1 న గుజరాత్ లోని సూరత్ జిల్లాలో సారస్ అనే గ్రామం లో ఉపాధ్యాయుడైన హరిభాయి, జన్మాబెన్ దంపతులకు జన్మించా రు. 13 సంవత్సరాల వయసులో మహదేవ్ దుర్గాబెన్ ను వివాహ మాడారు. ఆయన సూరత్ ఉన్నత పాఠశాల, ముంబయిలోని ఎల్ఫిన్ స్టోన్ కాలేజీలో చదివారు. ఆయన బి.ఎ పట్టభద్రుడు. మహదేవ్ దేశాయ్ మొదటిసారి 1915 లో గాంధీని కలిసారు. దేశాయ్ 1917లో సబర్మతీ ఆశ్రమంలో ఆయన భార్య దుర్గాబెన్తో పాటు చేరారు. ఆ సంవత్సరం చంపారన్ ఉద్యమం జరిగింది. ఆయన డిసెంబర్ 13,1917 నుండి ఆగస్టు 14,1942 వరకు ఆయన మరణించే తేదీ ముందురోజు వరకు ఒక డైరీని నిర్వహించారు. దానిలో ఆయనకు మహాత్మాగాంధీ సాన్ని హిత్యం గురించి వ్రాసారు. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 1919లో అరెస్టు చేసినపుడు గాంధీజీ తన వారసునిగా దేశాయ్ ని ప్రకటిం చారు. దేశాయ్ మొదటిసారి 1921 లో అరెస్టు కాబడి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించారు. ఆయన 25 సంవత్సరాలపాటు గాంధీజీకి వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్నారు.
గాంధీజీ కంటే ముందే వేకువ జామున లేచేవారు. గాంధీతో నిరంతరం గడపేవారు. ఆరోజు జరిగిన విషయలను డైరీలో నమోదు చేసేవారు. అన్నీ తానే అయి చూసేవారు. 1920 లో మోతీలాల్ నెహ్రూ తన వార్తా పత్రిక ప్రింటింగ్ ప్రెస్సు బ్రిటిష్ ప్రభుత్వం జప్తు చేసిన తరువాత చేతితో వ్రాసిన సైక్లోస్టైల్ వార్తా పత్రికను బయటకు తీసుకు రావడం ద్వారా దేశాయ్ సంచలనాన్ని సృష్టించారు దేశాయ్. 1921 లో దేశాయ్ను తన రచనలకు ఒక సంవత్సరం కఠిన మైన జైలు శిక్ష విధించారు.
దేశాయ్ 1924 లో నవజీవన్ సంపాద కుడిగా బాధ్యతలు స్వీకరించారు. 1925 నుండి గాంధీ ఆత్మకథ, యంగ్ ఇండియాలో దాని సీరియల్ ప్రచురణ కోసం ఆంగ్లం లోకి అను వాదం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం ఆయన సత్యాగ్రహ ఆశ్రమ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ అయ్యారు. సర్దార్ పటేల్తో కలిసి బార్డోలి సత్యా గ్రహంలో పాల్గొన్నారు. గుజరాతీ లో సత్యాగ్రహ చరిత్రను వ్రాసారు. దీనిని ఆంగ్లంలోకి ది స్టోరీ ఆఫ్ బార్డోలిగా అనువదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. గాంధీతో పాటు మీరాబెన్, దేవదాస్ గాంధీ, ప్యారేలాల్ లతో కలిసి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. కింగ్ జార్జ్ %ఌ% ను కలిసేందుకు గాంధీతో పాటు వెళ్ళిన ఏకైక వ్యక్తి ఆయన. 1932 లో దేశాయ్ను మళ్లీ అరెస్టు చేసి గాంధీ, సర్దార్ పటేల్తో కలిసి జైలుకు పంపారు. 1933 లో జైలులో ఉన్న ఈ సమయంలోనే ఆయన "గీత ప్రకారం గాంధీ" పుస్తకాన్ని రాశారు. దేశాయ్ 1939 లో రాజ్కోట్, మైసూర్ రాచరిక రాష్ట్రాలలో ప్రజల ఉద్యమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. దేశాయ్ చివరి జైలు శిక్ష 1942 ఆగస్టు 8 నాటి క్విట్ ఇండియా ప్రకటన తరువాత జరిగింది. ఆయన 1942 ఆగస్టు 9 ఉదయం అరెస్టు చేయబడ్డారు. ఆరు రోజుల తరువాత ఆగస్టు 15 1942న గుండె పోటుతో మరణించే వరకు గాంధీతో పాటు అగాఖాన్ ప్యాలెస్లో ఉన్నారు. గాంధీజీ స్వయంగా దేశాయ్ భౌతిక కాయానికి స్నానం చేయించారు. ఆగాఖాన్ పాలెస్ మైదానంలో ఆయనను దహనం చేసారు. ఆ ప్రదేశంలో ప్రస్తుతం ఆయన సమాధి ఉంది. భారత తపాలా శాఖ దేశాయ్ గౌరవార్థం 1983లో తపాలా బిళ్ళపై ఆయన బొమ్మను ముద్రించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల....**
**9440595494**

## నవ కవిత్వం

# నానీలు



సెన్సార్ పంజరం
తెరుచుకుంది
ఒ.టి.టి. వనంలో
అశ్లీల పక్షులు

మోసానికీ ఉంది
కాలపరిమితి !
తెల్ల జుట్టుపై
నల్ల రంగులా

ఉత్తరం
వెళ్ళిపోయింది
సెల్ఫోన్‌జి
సమాధిలోకిజి

ఇచట ఓట్లు
అమ్మబడును !
వెలజి
ఐదేళ్ళ అభివృద్ధి

చెట్టు
పుస్తకం
ఆశ్రయమిస్తే
ఆశీర్వదిస్తాయి

**–సోమిశెట్టి వేణుగోపాల్**
**9182584724**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

ఆదివారం అనుబంధంలో శ్రీరామనవమి సందర్భంగా జగమంత రామమయం అంటూ సగిన కవర్ పేజీ కథనం బాగుంది. రచయి-ంతకు మీకు ధన్యవాదాలువ్యాసం చాలా బాగుంది. ప్రతి అక్షరం స్ఫర్తిగా సాగింది సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసాలు రాయించి ప్రచురిస్తున్న మీ కు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మరచిపోయి బావదారిద్రంలో ఉన్న వారికి ఉపయోగపడుతుందని నా మనవి.


**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**



వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**


# ఉసురు తీసే ఉరికొయ్యలు



తాతలు సాలు ఒడిసి చేతిల వెట్టిన
సెలకకు
మూడు పుటాలు తింపుకుంట
ముత్తాతలు ముడ్డి తుడుసుకున్న
పత్రం ఎరుక జేప్పుమంటుండ్రు,
పండే భూమి బీడు భూమై
పరుపు బండ కావద్దని
అధికారులకు అర్జీలు పెట్టిపెట్టి
కాచ్ర డబ్బుల పడ్డా
కాగితమైతుండు,
పట్టబుక్కులో మిస్సైన గుంటల
కోసం
ఏ ఆఫీస్ మెట్లు ఎక్కినా
ఏడు చెర్ల నీళ్లు తాగిపిస్తుంటే
ప్రజా వాయిస్కు ఇనిపిద్దమంటే
అస్సలు రైతు వాణే ఎక్కుతలేదు,
దాస్రలన్నీ సక్కగున్న
హక్కు పత్రమీయ్యా
టేబుల్ కింద అసలు కాగితం
అనవాల్లు కనవడందే
అర్కిసన్న అడుగు
జరగదంటుండ్రు,
ఆరేడు పదుల నుంచి ఉన్న
అనుభవదారున్నీ ఆకిట్లకు గెదిమి
ఎద్దు ముఖానికి ముడ్డి బొక్కకు
తేడా తేలనోళ్ళను పిలిసి
గెట్టు మొత్తంకు యాజమాన్యాపు
ముల్లుగట్టే అందిస్తుండ్రు,
నిండా ఎకరం భూమి లేనోడికే
దునియా రూల్స్ అడ్డమత్తె
అన్ని ఉన్నోనికీ తివాచీలు
పరిసినట్టు
స్పెషల్ జీ.ఒ లతో పట్టాలను
పట్టం కడుతరు,
పట్టలేని భూమి కర్రులేని
నాగలసుంటిదని
అగ్గికి ఆహుతి అవ్వడానికి
పెట్రోల్ పోసుకుటుండు
తనువు చాలించా
పురుగులమందును పెరుగన్నం
చేసుకుంటుండు,
రైతుల పట్ల నియంతగా
వ్యవహరిస్తున్న ఆఫీసులు
కర్షకుల కంఠానికి తాళ్ళు
పెనుతున్న కేంద్రాలు
గురిపెట్టి గుండెను చీల్చే
బందుకులు
బేడిలేసి బెజత్తి జేసి ఉసురు తీసే
ఉరికొయ్యలు

**జి.యం.నాగేష్ యాదవ్**
**9494893625**

ఫన్ చ్










నారు

# సూర్య బుడత



**బాలల కథ**

## వర్షం

ఒక్కొక్క చినుకుగా వర్షం పడుతోంది

" ఈ చినుకుల వాన వరదగా మారేలా వర్షం కురిస్తే బాగుంటుంది. " అంటున్న తాతయ్య మాటలు విని గట్టిగా నవ్వుతూ "వాన చినుకు వరదలా మారుతోందని ఆశించడం చాలా అన్యాయం" అన్నాడు ఆరవతరగతి చదివే వినోద్ .

అంతలోనే ఒక్కొక్క చినుకుగా పడుతున్న వర్షం నిలిచింది. నేనే గెలిచానన్నట్టుగా బొటన వేలు పైకెత్తి తాతయ్యకు చూపించాడు వినోద్ . రెండు రోజులు గడిచింది.

"అమ్మా ఈ రోజు శనివారం, మా కాలేజీకి చపాతీలు మాత్రమే తీసుకెళ్లాలి "అన్నాడు వినోద్ అన్నయ్య .

"చపాతీలు మాత్రమేనా ఎందుకూ అన్నయ్యా "అడిగాడు వినోద్

" గత రెండు వారాలుగా యూనిఫామ్ లాగా తిండికి ఒక యూనిఫామ్ పెట్టినట్లు శనివారం మాత్రం అందరూ చపాతీలు తీసుకొనిరావాలని ఆర్డర్ వేశారు "అన్నాడు

ఆ మధ్యాహ్నం "వినోద్, మనం కాలేజీకి వెళ్ళాలి. నీకు వరద చూపిస్తాను" తాతయ్య అన్నాడు.

"ఎండలు నిప్పుల్లా ఉంటే ఈ సమయంలో వరదను చూడటమా తాతయ్య" అన్నాడు

తాతయ్యతో కలసి అన్నయ్య చదివే కాలేజీకి వెళ్ళాడు

ఆ కాలేజీలో విద్యార్థులు వరసగా నిలబడి ఏదో పొట్లం వేస్తున్నారు ,అక్కడ ఉంచిన పెద్ద బుట్ట నిండటంతో వేరొక బుట్ట ఉంచుతున్నారు .


కాస్సేపు తరువాత మైక్ ముందు మాట్లాడుతూ "ఈ పట్టణ అనాధాశ్రమం నిధి పరిస్థితి చాలా కష్టంగా వుండటంతో వారంలో ఒకరోజు అయినా ఆహారం దానం చేయగలరా అంటూ మన కాలేజీ వచ్చి అడిగారు, అందరూ ఒకే ఆహారం ఇస్తే బాగుంటుందని ప్రతి శనివారం చపాతీలు తీసుకొని రమ్మని ఆర్డర్ వేసాను .ఈ రోజు మీరు తెచ్చుకొన్న చపాతీలలో ఒకటి





లేక రెండు దానం చేసి పిల్లల ఆకలి బాధను తీర్చండి అన్నాను. ఇన్ని చపాతీలు వస్తుందని ఊహించని ఆ ఆశ్రమ నిర్వాహకుడు ,ప్రక్క పట్టణంలోని ఆశ్రమానికి కూడా తీసుకెళ్తున్నట్లు చెప్పారు . మీరు దయతో మీ ఆహారం కొంత భాగం వేసినా చినుకుల వర్షం ఒక్కసారిగా వరదయినట్లు ఎవరూ ఎదురు చూడనంత ఆహారం సేకరించారు. " అన్నాడు ప్రిన్సిపాల్

అంతటి ఎండనుండి ఒక్కసారిగా మబ్బు మూసుకొని ఒక్కొక్క చినుకు వర్షం వస్తుంటే "తాతయ్య చూస్తుంటే ఇంతకు మునుపు చూసినట్లు ఈ వర్షం వరదలా మారడానికి అవకాశం వుంది " అన్నాడు వినోద్ .

**ఓట్ర ప్రకాష్ రావు**
**తిరుత్తణి 09787446026 .**









# మానవ స్వభావాల లోతుల్ని స్పృశించిన కథలు

చిత్తూరు జిల్లా మాండలికానికి పెద్దపీట వేస్తూ స్థానికత నేపథ్యంలో తన పూరితో పెనవేసుకున్న అనుభవాల సమాహారాన్ని వస్తువుగా స్వీకరించి టామ్ సాయర్ వంటి కిష్టడి పాత్రను సృష్టించి ఆ పాత్రతో మిళితమయ్యే విభిన్న మానవ స్వభావాలను, ప్రవృత్తులను హాస్యస్ఫోరక కథలుగా మలుస్తున్న కథకుడు ఆర్.సి. కృష్ణస్వామిరాజు. పాతికేళ్లుగా కథారచన చేస్తున్న ఈ రచయిత వెలువరించిన 13వ కథాసంకలనం 'పుత్తూరు పిల'గోడు'. జీవితానుభవాల్లోంచి ఉద్భవించే కథల్లోనే సహజత్వం ఉట్టిపడుతుంది. ఇదే లక్షణం రాజు కథలన్నింటిలోనూ కనిపిస్తుంది. మనిషి జీవనయానంలో బాల్యం ఒక అద్భుత ఘట్టమైతే ఆ ఘట్టంతోనే మనిషి విభిన్న ప్రవృత్తుల్ని సంలీనం చేస్తూ కథలు వెలువరించడం ఈ రచయిత ప్రత్యేకత.

ఈ సంపుటిలోని కథలన్నీ గొలుసుకట్టు కథల్లా కనిపిస్తాయి. ఎందుకంటే గ్రామీణ జనజీవితంలోని అనేక పాత్రల సమాహారంతో ఈ కథలు సాగుతుంటాయి. అవన్నీ ఒక గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తుంటాయి. ఇందులోని ప్రధానపాత్ర కిష్టడి అనుభవాల పరంపర మానవ మనస్తత్వాల నిభిన్న లోతుల్ని స్పృశించి ఆలోతుల్ని కథలుగా మలిచింది. అందుకే ఇందులోని సంఘటనలన్నీ మన జీవితాల్లో జరిగినట్టే అనిపిస్తాయి. ఆ పాత్రలన్నీ మనమధ్యే వున్నట్టు అనిపిస్తాయి. కథల వ్యక్తీకరణలో రచయిత హాస్యచతురతను, వ్యంగ్యధోరణిని అవలంభించడం వల్ల ఆ కథలు మనల్ని మురిపిస్తుంటాయి. కిష్టడి పాత్రమీద ఆసక్తిని పుట్టిస్తాయి. ఒకప్పటి చిత్తూరు జిల్లాలోని నారాయణవనం ప్రాంతం ఈ కథలకు కేంద్రబిందువు. అక్కడి జనజీవితాల్లో జరిగే నిత్యవ్యవహారాలు,




మనుషుల మధ్య పొడసూపే ఉద్వేగాలు, అభిమానాలూ వీటిలో కనిపిస్తాయి. పుత్తూరు పిలగోడిగా ఆపూరిజనం అభిమానాన్ని పొందే కిష్టడి అమాయకత్వంలోంచి ఆవిర్భవించే పలు సూక్ష్మమైన అంశాలు కూడా కథలయ్యాయి. ఇవన్నీ సరదా కథలని రచయిత చెప్పుకున్నా ఈ కథల్లో ఈ కథల్లో మానవ సంబంధాలూ, విభిన్న స్వభావాలూ కనిపిస్తాయి. బాలసాహిత్యంలోనూ మంచి పట్టున్న ఈ రచయిత ఆ పద్ధతినే పాటిస్తూ ఈ కథల్లోనూ క్లుప్తతకు ప్రాధాన్యతనిచ్చారు.

నాలుగు రూపాయల చిల్లర డబ్బు వసూలు చేసుకోవడం కోసం కిష్టడిని మాటిమాటికీ ముంచెత్తే ఉంగరాల సుబ్బన్న లోభితనం, భర్తను పోగొట్టుకున్న తనను గొంగళి పురుగులా చూసే ఊళ్లోని ఆడవాళ్ల మధ్య గట్టిగట్టిగా ఏడుస్తూ ఇంటికొచ్చాక ఒంటరితనంలో తనివితీరా ఆనందపడే తులసక్క బలవంతపు ద్వైదీభావం, దిగుడుబావిలో జారిపడిపోయిన గుణావతక్కను రక్షించినందుకు సాహసవీరునిగా ప్రశంసలందుకున్న కిష్టడి అకాలధీరత్వమూ, అందరిముందూ ప్రతాపాన్ని చూపిస్తూ స్నానాలగదిలో తనకు వీపు రుద్దేటప్పుడు భార్య చూపించే ప్రతాపానికి భయపడే బీకిరాజు దీనత్వమూ, దొంగలు తిరుగుతున్నారన్నాఅరువు తీసుకున్నరోల్డుగోల్డు నగలు ధరించి రోడ్డుమీద ధైర్యంగా వెళ్లే భాగ్యమక్క భేషజమూ, గంగజాతరలో పులివేషం వేస్తూ తనమీద పడ్డాదని యువతిచేత తిట్టించుకొనే చెంగన్నకు సపోర్టుగా ఆ యువతిని చెడామడా తిట్టేసి ఇంట్లో మాత్రం అతనిపై తిట్లవర్షం కురిపించే పుష్పక్క సార్వభౌమాధికారత్వమూ, దినపత్రికలో తనపేరు రానందుకు గడ్డం పెంచుకొని విపరీతంగా డీలాపడిపోయే సీతారామన్న పబ్లిసిటీపిచ్చి ఈ కథల్లో వస్తువులుగా కనిపిస్తాయి. హంపి వెంకటమామ నిర్యాణము, పట్టు పరిశ్రమ వంటి పదప్రయోగాల్లోంచి, భాషాసమస్యల్లోంచి పుట్టుకొచ్చిన 'కాదు కాదు అంటూనే కుర్రది', 'కరీంనగరి కుట్టి', 'ఏక్ దోతీన్', 'కుప్పన్నకు కోపమేల వచ్చెనో' వంటి కథలు కనిపిస్తాయి. సాధారణంగా గ్రామాల్లో కొందరికి వారి స్వభావాలకు తగినట్టుగా వారి పేర్లు పెడుతూ వారిని ఆటపట్టిస్తుంటారు. క్రమంగా వారికి ఆ పేర్లు స్థిరపడిపోతాయి. ఆ నేపథ్యంలోనే గడ్డముక్కు గజలక్ష్మి, నేరేడురంగు నీరజ, తేనే సుధాకరుడు, సుండల్ సుందరం, సిజేరియన్ కొడుకు, పడిసెం ప్రసాద్, ఉంగరాల చెంగల్రాయలు వంటి పాత్రలు ఈ కథల్లో కనివిస్తాయి. గ్రామాల్లో ఆడపిల్లల మనస్తత్వం ఎలావుంటుందో 'పేర్కొంటూ'హైద్రాబాద్ పెండ్లికూతురు ఎలా వుంటుందో చూద్దామని పెండ్లి జరుగుతున్నంత'సేపూ ఊళ్లో ఆడపిలకాయలు ఆ అమ్మి చుట్టూ రంగురాట్నం లెక్కన తిరిగినారు' అని ఒక పెళ్లిసన్నివేశంలో వర్ణించడం ఈ రచయిత హాస్యస్ఫోరక రచనాశైలికి ఒక ఉదాహరణ. ప్రసిద్ధి చెందిన 'పుత్తూరు కట్టు' శల్యవైద్యుల కుటుంబంతో సన్నిహితంగా వుంటూ వైద్యంలోనూ హాస్యకథల పాత్ర వుంటుందని, ఆ కథలు చెప్పడమూ వైద్యంలా ఉపకరిస్తుందని ప్రగాఢంగా విశ్వసించే ఈ రచయిత ఆ దిశగా కథారచన చేస్తున్నారు.

## పుస్తక సమీక్ష


**– డాక్టర్ కొత్వాలు అమరేంద్ర**
**(917732414)**

**పుత్తూరు పిల'గోడు'(సరదా కథలు)**
**రచన.. ఆర్. సి. కృష్ణస్వామిరాజు, 9393662821**
**పుటలు:107, వెల: 160 రూ.**

# ప్రాథమిక స్థాయి పిల్లల"తెలుగు బడి బాలవాచకం"

అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించేవాడు" గురువు. తన విజ్ఞాన బండాగారం అంతా విద్యార్థులకు ధారాధత్తం చేస్తాడు. తన జ్ఞాన సంపాదన విద్యార్థులు సులభంగా ఆకలింపు చేసుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూ, చిన్నారి పొన్నారి పిల్లల మానసిక స్థాయిని గుర్తించి, వారి స్థాయికి దిగి వచ్చి బోధిస్తాడు ఉపాధ్యాయుడు. ముఖ్యంగా మాతృభాషను విద్యార్థులు ఇష్టంగా, ఎలాంటి ఆయాసం లేకుండా నేర్పించడం ప్రాథమిక స్థాయి బోధించే ఉపాధ్యా యుడికి, ముఖ్యంగా భాషోపాధ్యాయుడికి వెన్న తో పెట్టిన విద్య. అందుకే రకరకాల సులభమైన బోధ నా పద్ధతుల ద్వారా ఉపాధ్యాయుడు బోధనా కృషి చేస్తాడు. మాతృభాష అంటే మమకారం ఉండి, విద్యా ర్థులకు సులభంగా ప్రాథమిక స్థాయికి సంబంధించిన పరిజ్ఞానం అందించడానికి ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా పిల్లల కోసం "తెలుగు బడి బాల వాచకాన్ని" అందించిన కరీంనగర్ కు చెందిన మాతృభాష ప్రేమికుడు వృత్తిరీత్యా భాషోపాధ్యాయుడు కూకట్ల తిరుపతి గారు.

కరోనా మహమ్మారి చేసిన ప్రళయం అంతా ఇంతా కాదు. ప్రపంచమంతా గడగడలాడింది. లాక్ డౌన్ తో పాఠశాలలు మూతపడడం, విద్యార్థులు చదువులకు దూరం అవడం, పిల్లలు ఇంటికే పరిమితమయ్యారు. ఏ విధంగానైనా విద్యార్థులకు పాఠాలు అందించాలని సంకల్పంతో తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడానికి ఆన్లైన్ పాఠాలు అందించాలని పూనుకున్నారు .తనకు ఈ సాంకేతిక పరిజ్ఞానమంతగా లేదు. కానీ తన పుత్రరత్నం సహకారంతో ఆన్లైన్ పాఠాల కోసం




వీడియోలు చేసి ఎడిటింగ్ మిక్సింగ్ చేయడం నేర్చుకున్నారు. అంతేకాకుండా విద్యార్థుల కోసం ఒక యూట్యూబ్ ఛానల్ కూడా క్రియేట్ చేశారు.

మొదట పిల్లలు తెలుగు చదవడం రాయడం రావాలి సులభంగా నేర్చుకోవాలి. సులభతరం నుండి కఠినం వైపుగా వారి అభ్యసన సాగాలి అనే ఉద్దేశంతో మాతృభాషా ఉపాధ్యాయుడు కూకట్ల తిరుపతి గారు చిరు ప్రయత్నంగా పాఠాలవారీగా విషయమంతా స్వీకరించారు .ప్రతిరోజు కొంత సమయం కేటాయించి తెలుగు పాఠాలతో కూడిన వీడియోలు రూపొందించడం జరిగింది. మాతృభాషలో పట్టుంటేనే పరభాషల ను సులభంగా నేర్చుకుంటారని చెబుతుంటారు పెద్దలు .అందుకే పిల్లలకు మాతృభాషను సులభంగా పరిచయం చేసి, స్పష్టంగా చదివి%శీ%చే లా చేస్తే ఎలాంటి తప్పులు లేకుండా రాయగలుగుతారు. అందుకే మొదటగా "తెలుగు భాష మూలల్లోకి వెళదాం, తెలుగును సులభంగా నేర్చుకుందామని "వీడియో పాఠాలను రూపొందించడం జరిగింది ఇందులో ద్విత్వాక్షర పదాలు గుణి%శీ%త పదాలు ,సరళ పదాలు, రూపం మారే ఒత్తులు, సంయుక్తాక్షర పదాలు, అక్షర పదాలు మొదలైనవి రూపొందించడం జరిగింది. దాదాపుగా 50 వీడియో పాఠాలను పిల్లల కోసం సిద్ధం చేశారు. "మన ఊరు మనబడి వాట్సాప్" గ్రూప్ ను ఏర్పాటు చేసి అందులో ఈ వీడియో పాఠాలను, దానికి సంబంధించిన లింకులను రోజువారిగా పంపించారు .తల్లిదండ్రుల సహాయంతో విద్యార్థులు నేర్చుకునేలా కూకట్ల తిరుపతి గారు తల్లిదండ్రులను పురమాయించడం జరిగింది .వీటికి తగిన స్పందన వచ్చింది.

ఇంకా చెప్పాలంటే ఈ తెలుగు బడి బాలవాచకంలో ప్రతి పాఠానికి క్యూఆర్ కోడ్ రూపొందించడం జరిగింది. వాటిని స్కాన్ చేయగానే నేరుగా యూట్యూబ్లో ఉన్న పాఠంలోకి తీసుకెళ్తుంది. ఈ విధంగా తెలుగును సులభంగా చదవడం రాయడం ఆశించవచ్చు . పూర్వ ప్రాథమిక, మరియు ప్రాథమిక తరగతిలో పిల్లలు తెలుగు భాషను నేర్చుకునే వారికి సహాయపడేటట్లుగా ఈ పుస్తకాన్ని రూపొందించడం జరిగింది .అంతేకాకుండా ఈ పుస్తకంలో మన సంస్కృతి సంప్రదాయాలను, అదనంగా చేర్చడం జరిగింది .మన ఆటలు, మన పండుగలు, పొడుపు కథలు, జాతీయాలు, సామెతలు, తెలుగు వారాలు ,తిథులు, మాసాలు, రుతువులు, కాలాలు, తెలుగు సంవత్సరాలు యుగాలు, నక్షత్రాలు ,రాశులు కాలాలు ప్రాథమిక స్థాయి విద్యార్థులకు తప్పనిసరిగా రావాలనే ఉద్దేశంతో చక్కటి ప్రయత్నం చేశారు కవి రచయిత కూకట్ల తిరుపతి గారు.

ఒక విధంగా చెప్పాలంటే చిన్నారి విద్యార్థుల చేతుల్లో ఉన్నటువంటి మరో "చిట్టి బాలశిక్షగా" రూపొందించారు తిరుపతి గారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తన విలువైన సమయాన్ని కేటాయించి విద్యార్థులు మాతృభాషలో ప్రావీణ్యం పొందడానికి చేసిన ప్రయత్నం నూటికి నూరుపాళ్ళ విజయం సాధించి తీరుతుంది అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. కూకట్ల తిరుపతి గారు రూపొందించిన "తెలుగు బడి బాలవాచకం ప్రతి పాఠశాలలో, గ్రంథాలయంలో, విద్యార్థుల చేతుల్లో ఉండాల్సిన పుస్తకం ఇది. ఈ పుస్తకంలోని మొత్తం పేజీల సంఖ్య 79. పుస్తకం ముఖ చిత్రం వర్ణమాలతో అందంగా తీర్చిదిద్దడం జరిగింది. పుస్తకం ధర 80 రూపాయలు.

బాలల భవిష్యత్తు కోసం మాతృభాషలో పరిపూర్ణమైన పట్టు సాధించడానికి కవి రచయిత గారి కలం నుండి మరెన్నో పుస్తకాలు జాలువారాలని కోరుకుందాం రచయితకు అభినందనలు శుభాకాంక్షలు.

**పుస్తక ప్రతులకు: కూకట్ల లక్ష్మి , ఇంటి నెంబర్ 8 బి3బి 2 0 7 /2/ 4/ఇ /1, రోడ్ నెంబర్ 7 , వాసుదేవ కాలనీ , కట్టరాంపూర్ , కరీంనగర్ .తెలంగాణ505001**

**సమీక్షకులు :యాదవరం చంద్రకాంత్ గౌడ్ , 9441762105**

## వెరైటీ వంటలు

# గోధుమ రవ్వ పులిహోర



కావలసిన పదార్థాలు:-1. గోధుమ రవ్వ-రెండు కప్పులు,2.నానబెట్టిన పచ్చి బఠానీలు - అరకప్పు, 3.నానబెట్టిన బాదంపప్పు ముక్కలు-పావు కప్పు, 4.నువ్వులుంఅవిసె గింజల పొడి-రెండు స్పూన్లు, 5.తాలింపు గింజలు- శనగపప్పు-ఒక స్పూను, మినప గుండ్లు-ఒక స్పూను, జీరా-అర స్పూను, ఆవాలు- కొంచెంగా, 6.ఎండుమిర్చి-మూడు,7.సన్నగా కోసిన పచ్చిమిర్చి-నాలుగు కాయలు, 8.చింతచిగురు-ఒక కప్పు, 9.ఉప్పు, పసుపు, నెయ్యి- తగినంత, 10.కొత్తిమీరం పుదీనా-రెండు స్పూన్లు, 11.నీళ్లు-నాలుగు కప్పులు, 12.క్యారెట్ తురుము-అర కప్పు.

తయారు చేయు విధానం:- గోధుమ రవ్వని వెడల్పు గిన్నెలోకి తీసుకుని నాలుగు గ్లాసులు నీళ్లు పోసి కొంచెంగా ఉప్పు వేసి ఒక స్పూను నెయ్యి వేసి కుక్కర్లో పెట్టి మూత పెట్టి స్టవ్ మీద పెట్టి నాలుగు కూతలు రానిచ్చి దించి పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద బాండీ పెట్టి మూడు స్పూన్లు నెయ్యి వేసి తాలింపు గింజలు, ఎండుమిర్చి, పచ్చిమిర్చి వేసి దోరగా వేగాక నానబెట్టిన పచ్చి బఠానీలు, బాదంపప్పు ముక్కలు వేసి కొద్దిసేపు వేగించాలి. దీనిలోనే క్యారెట్ తురుము వేసి ఐదు నిమిషాలు వేగించాలి. ఇప్పుడు నువ్వులుంఅవిసె గింజల పొడి, తగినంత ఉప్పు, పసుపు, చింతచిగురు, కొత్తిమీర-పుదీనా వేసి కలపాలి. ఈ మిశ్రమంలో ఉడికించిన గోధుమ రవ్వ వేసి బాగా కలిపి రెండు నిమిషాలు వుంచి దించి పక్కన పెట్టుకోవాలి. కొద్దిగా వేడి తగ్గాక ఈ గోధుమ రవ్వ పులిహోరని సర్వింగ్ ప్లేట్ లోకి తీసుకొని అమ్మవారికి నివేదించాలి.

# బియ్యపు రవ్వ పొంగలి



కావలసిన పదార్థాలు:-1. బియ్యపు రవ్వ-ఒక కప్పు, 2.పెసరపప్పు-రెండు స్పూన్లు, 3.పాలు-మూడు కప్పులు, 4.కొబ్బరి తురుము-పావు కప్పు, 5.జీడింబాదం ముక్కలు-పావు కప్పు, 6.నెయ్యి-పావు కప్పు, 7.బెల్లం తురుము-200 గ్రాములు, 8.నువ్వుల పొడి-ఒక స్పూను, 9.ఏలకుల పొడి-అర స్పూను, 10.ఎండుద్రాక్ష- 15.

తయారు చేయు విధానం:- బియ్యపు రవ్వని ఒక గిన్నెలో వెయ్యాలి. పెసరపప్పుని శుభ్రంగా కడిగి రవ్వలో వెయ్యాలి. దీనిలో రెండు స్పూన్ల నెయ్యి, పాలు పోసి కుక్కర్లో పెట్టి స్టవ్ మీద పెట్టి మూడు కూతలు రానిచ్చి దించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి రెండు స్పూన్ల నెయ్యి వేసి జీడింబాదం ముక్కలు, ఎండు ద్రాక్ష వేసి దోరగా వేగించాలి. ఇవి వేగాక కొబ్బరితురు, నువ్వుల పొడి, ఏలకుల పొడి, వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఉడికించిన బియ్యపు రవ్వ మిశ్రమాన్ని వేసి కొంచెంగా పాలు పోసి, నెయ్యి వేసి కలిపి ఐదు నిమిషాలు ఉడికించి దించి పక్కన పెట్టుకోవాలి. ఈ ఈ బియ్యపు రవ్వ పొంగలిని సర్వింగ్ ప్లేట్ లోకి తీసుకొని అమ్మవారికి నివేదన చేయాలి.

# పాల బూరెలు



కావలసిన పదార్థాలు:-1. గోధుమపిండి-రెండు కప్పులు, 2.బొంబాయి రవ్వ-రెండు స్పూన్లు, 3.బెల్లం తురుము- 300 గ్రాములు, 4.కొబ్బరి తురుము-అర కప్పు, 5.నువ్వులు-ఒక స్పూను, 6.ఏలకుల పొడి-అర స్పూను, 7.కాచిన పాలు-అరకప్పు, 8.నూనె తగినంత.

తయారు చేయు విధానం:- స్టవ్ మీద గిన్నెపెట్టి బెల్లం తురుము, పాలు, ఏలకుల పొడి వేసి బెల్లం పూర్తిగా కరిగే వరకు గరిటతో తిప్పుతూ ఉండాలి. ఇది కొంచెం చిక్కబడ్డాక స్టవ్ ని సిమ్ములో పెట్టి ముందుగా కొబ్బరి తురుము, బొంబాయి రవ్వ వేసి కలపాలి. ఇప్పుడు గోధుమ పిండిని కొంచెం కొంచెంగా పోస్తూ ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. నువ్వుల పొడి, ఏలకుల పొడి కూడా వేసి కలిపి దించి పక్కన పెట్టుకోవాలి. ఈ పిండి కొద్దిగా వేడి తగ్గాక చిన్న చిన్న బాల్స్ లాగా చేసి వాటిని పాలిథిన్ కవర్ పై పెట్టి చేత్తో బూరెల్లాగా గుండ్రంగా వత్తాలి. స్టవ్ మీద బాండీ పెట్టి తగినంత నూనె పోసి కాగాక రెడీ చేసి పెట్టుకున్న బూరెల్ని నూనెలో వేసి రెండువైపులా తిప్పుతూ దోరగా వచ్చేలా కాల్చాలి. ఈ పిండి మొత్తాన్ని బూరెల్లాగా వత్తి నూనెలో దోరగా కాల్చుకోవాలి. ఈ పాల బూరెల్ని తీసి సర్వింగ్ ప్లేట్లో పెట్టుకుని అమ్మవారికి నివేదన చెయ్యాలి.

# మొక్కజొన్నం పెసరపప్పు వడలు



కావలసిన పదార్థాలు:-1. మొక్కజొన్నవితులు-ఒక కప్పు, 2.పెసరపప్పు-ఒక కప్పు, 3.కొబ్బరి తురుము-పావు కప్పు, 4.కీరా తురుము- అర కప్పు, 5.జీలకర్ర-ఒక స్పూను, 6.నువ్వులు-ఒక స్పూను, 7.ఉప్పు, నూనె- తగినంత, 8.అల్లంం పచ్చిమిర్చి తరుగు-రెండు స్పూన్లు, 9.కొత్తిమీరంపుదీనా తరుగు-రెండు స్పూన్లు.

తయారు చేయు విధానం:- పెసరపప్పుని మూడు గంటలు నానబెట్టాలి. మొక్కజొన్న విత్తుల్ని నానబెట్టినవసరం లేదు. వీటిని శుభ్రంగా కడిగి ఉంచుకోవాలి. పెసరపప్పుని మిక్సీ జార్లో వేసి కొంచెం బరకగా మిక్సీ పట్టాలి. పప్పు మరీ గట్టిగా ఉంటే కొంచెంగా నీళ్లు చిలకరించి మిక్సీ పట్టాలి. ఇవి నలిగిన తర్వాత తీసి ఒక గిన్నెలో వేసుకోవాలి. ఇప్పుడు మొక్కజొన్న విత్తుల్ని కూడా కొంచెం బరకగా మిక్సీ పట్టాలి. వీటిల్లో నీళ్లు చిలకరించనవసరం లేదు. ఇవి కూడా నలిగాక తీసి పెసరపప్పు పిండిలో వెయ్యాలి. ఈ పిండిలోనే జీలకర్ర, నువ్వులు, కొత్తిమీరం పుదీనా, తగినంత ఉప్పు, కీరా తురుము, కొబ్బరి తురుము వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి నూనె పోసి కాగాక చెయ్యి తడి చేసుకుంటూ కొంచెం కొంచెం పిండిని తీసుకొంటూ పాలిథిన్ కవర్ పై పెట్టి వడలు లాగా చేసి నూనెలో వెయ్యాలి. వీటిని మధ్య మధ్యలో తిప్పుతూ రెండు వైపులా దోరగా కాలాక తీసి సర్వింగ్ ప్లేట్ లో పెట్టుకోవాలి. ఈ పెసరపప్పు ం మొక్కజొన్నవిత్తుల వడల్ని అమ్మవారికి నివేదన చెయ్యాలి.



పింగళి భాగ్యలక్ష్మి
9704725609




# క్రైస్తవులకు పవిత్రమైన పామ్ సండే

**యేసు ప్రభువు జేరుసలేం పట్టణంలో ప్రప్రథమంగా ప్రవేశించినపుడు అక్కడి ప్రజలు యేసు ప్రభువును గాడిదపై తీసుకుని వస్తూ పెద్దఎత్తున వివిధ రకాల మట్టలతో (చెట్ల కోమ్మలతో) ఘన స్వాగతం పలుకుతారు. దీనినే క్రైస్తవులు మట్టల పండుగగా ఆచరిస్తారని వారు తెలిపారు. ఈ పండగను గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం జరుపు కొం టారు. ఈ వారాన్ని పరిశుద్ధ వారంగా పరిగణిస్తారు. క్రైస్తవులు అత్యంత భక్త శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ విశేషాలు మీకోసం..** **యేసు ప్రభువు జేరుసలేం పట్టణంలో ప్రప్రథమంగా ప్రవేశించినపుడు అక్కడి ప్రజలు యేసు ప్రభువును గాడిదపై తీసుకుని వస్తూ పెద్దఎత్తున వివిధ రకాల మట్టలతో (చెట్ల కోమ్మలతో) ఘన స్వాగతం పలుకుతారు. దీనినే క్రైస్తవులు మట్టల పండుగగా ఆచరిస్తారని వారు తెలిపారు. ఈ పండగను గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం జరుపు కొం టారు. ఈ వారాన్ని పరిశుద్ధ వారంగా పరిగణిస్తారు. క్రైస్తవులు అత్యంత భక్త శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ విశేషాలు మీకోసం..**

ఈ పవిత్ర వారంలో, దేవుడు మన ఆలోచనలను మరియు దృష్టిని అత్యంత ముఖ్యమైన దాని వైపు మళ్ళించును గాక, మన రాజైన యేసుక్రీస్తు...

**మట్టల ఆదివారము (పామ్ సండే) అంటే ఏమిటి?**

మట్టల ఆదివారము (పామ్ సండే) అనేది ఈస్టర్ ఆదివారం వరకు పరిశుద్ధ వారం ప్రారంభాన్ని సూచించే క్రైస్తవ వేడుక. ఇది జెరూసలేంలోకి యేసు విజయవంతమైన ప్రవేశాన్ని గుర్తుచేసుకుంటుంది, ప్రజలు గౌరవ చిహ్నంగా ఆయన ముందు ఖర్జూరము కొమ్మలు ఉంచారు. ఆధునిక కాలంలో, చర్చిలు మట్టల ఆదివారము సేవలను నిర్వహించేవారు, దీనిలో ఆరాధకులకు ఖర్జూరము ఆకులతో చేసిన ఖర్జూరము కొమ్మ లేదా శిలువను ఇస్తారు. ఈ వేడుకలో కీర్తనలు పాడటం, లేఖనాలను చదవడం మరియు కొన్నిసార్లు అరచేతులతో ఊరేగింపు కూడా ఉంటాయి. పామ్ సండే అంటే యేసు మనకోసం తన జీవితాన్ని అర్పించడం ద్వారా చూపించిన నిస్వార్థ ప్రేమను గుర్తుచేస్తుంది మరియు ఇది మన స్వంత జీవితాలను మరియు మన చుట్టూ ఉన్నవారికి అదే ప్రేమను ఎలా చూపించవచ్చో ఆలోచించే సమయం.

మట్టల ఆదివారము అంటే మనం యేసు రక్షకుడిగా మరియు రాజుగా యెరూషలేములోకి ప్రవేశించిన రోజును గుర్తుంచుకుని జరుపుకుంటాము. యేసు గాడిదపై యెరూషలేములోకి ప్రవేశిస్తుండగా, ఒక పెద్ద జనసమూహం గుమిగూడి, యేసుకు రాజ మర్యాదను ఇస్తూ ఖర్జూరపు మట్టలను మరియు వారి వస్త్రాలను దారి పొడవునా పరిచారు. వందలాది మంది ప్రజలు, "దావీదు కుమారునికి హొసన్నా! ప్రభువు నామంలో వచ్చేవాడు ధన్యుడు! ఉన్నత స్వర్గంలో హొసన్నా!" అని కేకలు వేశారు.

అనేక చర్చిలు ఖర్జూరము కొమ్మలను ఊపుతూ, సాంప్రదాయ కీర్తనలు పాడుతూ మరియు ఖర్జూరము ఆకులతో శిలువలు తయారు చేస్తూ మట్టల ఆదివారం జరుపుకుంటారు. ఇది విజయోత్సవ ప్రవేశం అయినప్పటికీ, ఇది యేసు తన మరణం వైపు తీసుకున్న మొదటి అడుగు.


మత్తయి 21:4 మనకు ఇలా చెబుతుంది: ఇదిగో నీ రాజు సాత్వికుడై, గాడిదనుభారవాహక పశువుపిల్లయైన చిన్న గాడిదను ఎక్కినీయొద్దకు వచ్చుచున్నాడని సీయోను కుమారితో చెప్పుడి అనునది, నెరవేరుటకు ఇది జరిగింది. లిఈ ప్రవచనం జెకర్యా 9:9 మరియు యెషయా 62:11 నుండి ఉ దహరించబడింది .

**పామ్ సండే విజయోత్సవ ప్రవేశం**

మత్తయి 21:1-11 - యేసు రాజుగా యెరూషలేముకు వస్తాడు

"మీ యెదుటనున్న గ్రామ మునకు వెళ్లుడిబీ వెళ్లగానే కట్టబడియున్న యొక గాడి దయు దానితోనున్న యొక గాడిదపిల్లయు మీకు కన బడును. వాటిని విప్పి నాయొద్దకు తోలుకొని రండిబీ ఎవడైనను మీతో ఏమైనను అనిన యెడలఅవి ప్రభువు నకు కావలసియున్నవని చెప్పవలెను, వెంటనే అతడు వాటిని తోలి పెట్టునని చెప్పి వారిని పంపెను. ప్రవక్తవలన చెప్పబడినది నెరవేరునట్లు ఇది జరిగెను, అదే మనగా ఇదిగో నీ రాజు సాత్వికుడై, గాడిదనుభారవాహక పశు వుపిల్లయైన చిన్న గాడిదను ఎక్కినీయొద్దకు వచ్చుచున్నాడని సీయోను కుమారితో చెప్పుడి అనునది. శిష్యులు వెళ్లి యేసు తమకాజ్ఞాపించిన ప్రకా రము చేసి ఆ గాడిదను దాని పిల్లను తోలుకొని వచ్చి వాటిమీద తమ బట్టలు వేయగా ఆయన బట్టలమీద కూర్చుండెను.

**(మిగతా 8వ పేజీలో)**



13.4.2025



( 7వ పేజీ తరువాయి)

జనసమూహములోను అనేకులు తమ బట్టలు దారిపొడుగున పరచిరిబీ కొందరు చెట్లకొమ్మలు నరికి దారిపొడుగున పరచిరి. జనసమూహములలో ఆయనకు ముందు వెళ్లుచుండినవారును వెనుక వచ్చుచుండిన వారును దావీదు కుమారునికి జయము ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడునుగాక సర్వోన్నతమైన స్థలములలో జయము అని కేకలు వేయుచుండిరి. ఆయన యె-రూషలేము లోనికి వచ్చినప్పుడు పట్టణమంతయుఈయన ఎవరో అని కలవరపడెను. జనసమూహముఈయన గలిలయ లోని నజరేతువాడగు ప్రవక్తయైన యేసు అని చెప్పిరి".
ఈ భాగములోని ఆయన వాక్యం గొప్ప సత్యాలను వెల్లడిస్తుంది. ఈ సత్యాలు మనల్ని క్రీస్తుకు దగ్గర చేరుస్తాయి, ఆయన మాత్రమే రాజు అని మనకు గుర్తు చేస్తాయి.

**మట్టల ఆదివారము (పామ్ సండే)**

మనకు క్రీస్తు రాజు అని గుర్తు చేసే 5 మార్గాలు

1. ది అవెంజర్స్ (జాస్ వెడాన్ %ి%వాల్ట్ డిస్నీ స్టూడియోస్ మోషన్ పిక్చర్స్, 2012%ి% దర్శకత్వం వహించినది. అవెంజర్స్ లో, లోకీ ఒక వ్యక్తిని బహిరంగంగా చంపిన తర్వాత ఒక జనసమూహాన్ని భయభ్రాంతులకు గురిచేస్తాడు. అందరూ తన ముందు మోకరిల్లి, తన పాలకుడిగా తనను గౌరవించాలని అతను డిమాండ్ చేస్తాడు. ఒక పరాక్రమవంతుడైన వృద్ధుడు లేచి నిలబడి, "మీలాంటి వ్యక్తులకు కాదు" అని అంటాడు. ఈ శక్తివంతమైన క్షణం యేసు ఎలా కనిపిస్తాడో దానికి పూర్తిగా విరుద్ధంగా చూపిస్తుంది. ఆయన గాడిదపై స్వారీ చేస్తున్న వినయపూర్వకమైన రాజు. ప్రజలు ప్రశంసలతో విజృంభించకుండా ఉండలేరు. నాయకులు దానిని ఆపడానికి ప్రయత్నించినప్పుడు, ప్రజలు కేకలు వేయకపోతే రాళ్ళు కేకలు వేస్తాయని యేసు వారికి చెబుతాడు. మనకు రాజు అవసరం, కానీ మనకు అవసరమైన రాజు యేసు. మరియు అతని రాజ్యం యొక్క నిబంధనలు మనం ఆశించే దానికంటే చాలా భిన్నంగా ఉండవచ్చు. అతనికి సేవ చేయడం అంటే మన అంచనాలను అతని చేతుల్లోకి వదులుకోవడం.
యేసు నగరంలోకి స్వారీ చేస్తుండగా ప్రజలు ఖర్జూరపు కొమ్మలను నరికి, గాలిలో ఊపి, ప్రజలు యేసు కోసం తమ వస్త్రాలను నేలపై పరిచారని దేవుని వాక్యం మనకు చెబుతుంది. ఖర్జూరపు కొమ్మ మంచితనాన్ని మరియు విజయాన్ని సూచిస్తుంది మరియు మరణంపై ఆయన త్వరలో సాధించబోయే చివరి విజయానికి ప్రతీక. వారు చూసిన అద్భుతాలన్నింటికీ దేవుణ్ణి స్తుతిస్తూ, కీర్తిస్తూవున్నారు. కాబట్టి, ఒక వ్యక్తి తన వస్త్రాలను రాజు ముందు పరిచయం చేసినప్పుడు, వారు " మా దగ్గర ఉన్నవన్నీ మరియు మాకు అవసరమైనవన్నీ మేము నీకు ఇస్తున్నాము " అని చెప్తున్నాను. దీన్ని మనం మన దగ్గర ఉన్నవన్నీ మరియు మనమేమైనా ఉన్నవన్నీ ఆయనకు ఇవ్వాలి.

**విముక్తి కోసం ఒక ఆశ:**

యేసు తమను స్వేచ్ఛకు నడిపిస్తాడని మరియు రోమా పాలకులను పడగొడతాడని జనసమూహాలు ఆశించి ఉండవచ్చు, ఎందుకంటే వారు మెస్సీయ రాజు కోసం ఎదురు చూస్తున్నారు.
"ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లు ఎక్కడ?" 1 కొరింథీ 15:55

2. యేసు గాడిదపై ప్రయాణించడానికి ఎంచుకున్నాడు, ఇది జెకర్యా 9:9 యొక్క పాత నిబంధన ప్రవచనాన్ని నేరుగా నెరవేర్చింది. దాని మీద స్వారీ చేయడం ద్వారా, యేసు తన మద్దతుదారులకు మరియు యెరూషలేము ప్రజలకు తాను ఒక రాజునని చెప్పాడు. అది తనకు దైవిక అధికారం ఉందని చూపించే ఒక మార్గం. శాంతిని సూచించే మరియు యుద్ధానికి గుర్తుగా ఉండే గుర్రంలా కాకుండా, గాడిద శాంతిని సూచిస్తుంది మరియు సౌమ్యత మరియు శాంతిని సూచిస్తుంది మరియు గుర్రానికి బదులుగా ఒకదాన్ని ఎంచుకోవడం ద్వారా, యేసు తన వినయాన్ని చూపించాడు. ఇది గాడిదపై నీతిమంతుడైన రాజు రాక గురించి పాత నిబంధన ప్రవచనాన్ని నెరవేర్చింది., అది ఎలా ఓపికగా బాధపడుతుందో మరియు ఇతరుల భారాలను మోస్తుందో చూస్తే, గాడిద శాంతిని సూచిస్తుంది. కాబట్టి వాటిపై స్వారీ చేయడానికి ఎంచుకున్న వారు శాంతియుత ఉద్దేశ్యాలతో వచ్చారని చూపించారు. అప్పుడు కూడా యేసు తాను శాంతి యువరాజు అని మనకు గుర్తు చేశాడు.
" సీయోను నివాసులారా, బహుగా సంతోషించుడిబీ యె-రూషలేము నివాసులారా, ఉల్లాసముగా ఉండుడిబీ నీ రాజు నీతిపరుడును రక్షణగలవాడును దీనుడునై, గాడిదను గాడిద పిల్లను ఎక్కి నీయొద్దకు వచ్చుచున్నాడు." జెకర్యా 9:9

3. ప్రజలు "హోసన్నా!" అని కేకలు వేసినప్పుడు వారు క్రీస్తును రాజుగా కీర్తిస్తున్నారు. ఆ పదానికి "ఇప్పుడే రక్షించు" అని అర్థం, మరియు వారి మనస్సులలో వారు భూసంబంధమైన రాజు కోసం ఎదురు చూస్తున్నప్పటికీ, తనను నమ్ముకునే వారందరికీ నిజమైన మోక్షాన్ని తీసుకురావడానికి దేవుడు వేరే మార్గాన్ని కలిగి ఉన్నాడు. మన వాక్యభాగంలో, యేసు ప్రయాణిస్తున్నప్పుడు ప్రజలు ఆయనను స్తుతించారు,

(మిగతా 9వ పేజీలో)







( 8వ పేజీ తరువాయి)

కానీ వారిలో చాలామంది రెండు కారణాల వల్ల ఆయనను స్తుతించారు. మొదటిది, ఆయన అద్భుతాల కారణంగా. ఆయన రోగులను స్వస్థపరిచాడు, చనిపోయినవారిని లేపాడు... ఆయన వారికి సేవ చేస్తున్నందున వారు ఆయనను స్తుతించారు మరియు రెండవది, రోమన్ల నుండి రాజకీయంగా విముక్తి పొందే మార్గాన్ని యేసులో చూసినందున – ఇశ్రాయేలు ఈజిప్టు నుండి విముక్తి పొందినట్లే రోమ్ నుండి విముక్తి పొందడం.

"ప్రభువు నామమున వచ్చువాడు ధన్యుడు!" కీర్తన 118:26

"యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు." రోమా 10:9

4. యేసు యెరూషలేము కోసం ఏడ్చాడని బైబిలు చెబుతోంది. యేసు యెరూషలేమును సమీపించినప్పుడు, వారు శాంతి మార్గాన్ని గుర్తించలేదని మరియు నగరానికి భవిష్యత్తులో జరగబోయే విధ్వంసం గురించి ఆలోచించి ఇప్పుడు ఆ నగరం గురించి ఏడ్చాడు. ఆ క్షణపు స్తుతి మధ్య, అదే ప్రజలు తనకు వెన్ను చూపి, తనను మోసం చేసి, సిలువ వేస్తారని ఆయనకు తన హృదయంలో తెలుసు. వారికి రక్షకుడు ఎంత అవసరమో వాస్తవికతతో ఆయన హృదయం పగిలింది.

" ఆయన పట్టణమునకు సమీపించినప్పుడు దానిని చూచి దాని విషయమై యేడ్చి, నీవును ఈ నీ దినమందైనను సమాధానసంబంధమైన సంగతులను తెలిసికొనినయెడల నీకెంతో మేలుబీ గాని యిప్పుడవి నీ కన్నులకు మరుగు చేయబడియున్నవి." లూకా 19:41-42



5. దేవుని పాలన ఏ మనిషి మనస్సు ఊహించలేని లేదా ప్లాన్ చేయగల దానికంటే చాలా గొప్పదని పామ్ సండే మనకు గుర్తు చేస్తుంది. పాపమునకు జీతము మరణము అని బైబుల్ గుర్తు చేస్తూవుంది. ప్రతి మానవుడు పాపము చేసి మరణమునకు పాత్రుడు అవుతున్నాడు. పాపము పై మరియు మరణంపై చివరి యుద్ధం చేయడానికి తన కుమారుడిని పంపాలనే అంతిమ ప్రణాళిక దేవునికి ఉంది. ఈరో జు మనం జరుపుకునే గొప్ప వేడుక ఇదే. క్రీస్తు అంతిమ త్యాగం కారణంగా మనం పాపము నుండి మరణం నుండి విముక్తి పొందవచ్చు.

"యేసు ఆమెతో, 'పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును' అని చెప్పెను" యోహాను 11:25

ఈ వారం మనం ఎంతో కృతజ్ఞులమై ఉండాలి. శత్రువుకు అది తెలుసు, మరియు ఈ పరిశుద్ధ వారం యొక్క నిజమైన అర్థం నుండి మనల్ని మళ్లించడానికి అతను చేయగలిగినదంతా చేస్తాడని. ఈ పరిశుద్ధ వారంలో, మన రాజైన యేసుక్రీస్తు... మన ఆలోచనలను మరియు దృష్టిని అత్యంత ముఖ్యమైన దాని వైపు మళ్ళించును గాక!

ఒక చిన్న అమ్మాయి ఒక తోటలో నడుస్తున్నప్పుడు ఒక అందమైన పువ్వును గమనించిందని ఒక కథ చెబుతారు. ఆమె దాని అందాన్ని మెచ్చుకుంది మరియు దాని సువాసనను ఆస్వాదించింది. "ఇది చాలా అందంగా ఉంది!" అని ఆమె ఆశ్చర్యపోయింది. ఆమె దానిని చూస్తుండగా, ఆమె కళ్ళు కాండం వెంట అది పెరిగిన నేల వైపుకు వెళ్ళాయి. " ఇంత అందమైన పువ్వును మట్టిలో నాటారు ఏమిటి?" అని ఆమె గట్టిగా అరిచింది. కాబట్టి ఆమె దానిని దాని వేళ్ళతో పైకి లాగి మట్టిని కడగడానికి నీటి కుళాయి వద్దకు పరిగెత్తింది. ఆ పువ్వు వాడిపోయి చనిపోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఆ చిన్న అమ్మాయి చేసిన పనిని చూసిన తోటమాలి, "నువ్వు నా అత్యుత్తమ మొక్కను నాశనం చేశావు!" అని ఆశ్చర్యపోయాడు. "క్షమించండి, కానీ ఆ మట్టిలో నాకు అది నచ్చలేదు," అని ఆమె చెప్పింది. తోటమాలి ఇలా జవాబిచ్చాడు, "నేను ఆ ప్రదేశాన్ని ఎంచుకున్నాను మరియు మట్టిని కలిపాను ఎందుకంటే అక్కడ మాత్రమే అది అందమైన పువ్వుగా ఎదగగలదని నాకు తెలుసు."

దేవుడు మనల్ని మనం ఉన్న చోటే ఉంచాడు. మనం ఆయనను విశ్వసించాలి. ఆయన మన ఒత్తిళ్లు, పరీక్షలు మరియు ఇబ్బందులను ఉపయోగించి మనల్ని కొత్త ఆధ్యాత్మిక సౌందర్యానికి తీసుకు వస్తున్నాడని మనం చివరికి చూస్తాము.

దేవుడు చేస్తున్న పనిని మనం అంగీకరించి, దానికి ఆయనకు కృతజ్ఞతలు చెప్పినప్పుడు నిజమైన సంతృప్తి వస్తుంది.


మీ విశ్వాసం సాధారణమైనది లేదా నిబద్ధతతో కూడినది. మన యేసు మనకోసం చాలా బాధను అనుభవించిన ఈ వారం మనం సమీపిస్తున్నందున, మన గత, వర్తమాన మరియు భవిష్యత్తు పాపాలు ఆయనను ఆ సిలువపై వేలాడదీసిన మేకులుగా ఉన్న వారంలో, యేసు చూడటానికి అర్హుడు కాదా? ఆయన మీ జీవితంపై పూర్తి నియంత్రణకు అర్హుడు కాదా? ఆయన మీతో వ్యక్తిగత సంబంధానికి అర్హుడు కాదా? ఈ వారం అన్నింటినీ పరిగణించండి... మరియు అన్నింటినీ అతనికి ఇవ్వాలని ఎంచుకోండి.. మన ప్రభువును ఆరాధించడం, ఆయన త్యాగం యొక్క బహుమతికి ఆయనకు కృతజ్ఞతలు చెప్పడం, పునరుత్థాన శక్తిని మరియు ఆయనలో మాత్రమే కనుగొనబడిన కొత్త జీవితాన్ని జరుపుకోవడంపై దృష్టి పెడదాం.

"వివరించలేని ఆయన వరమును బట్టి దేవునికి స్తోత్రము!"

2 కొరింథీ 9:15



**సుదర్శన్ బెన్ హర్,**
**సీనియర్ పాస్టర్**
**8074216140**



# సినిమా రివ్యూ




బుల్లితెర యాంకర్ ప్రదీప్ కి స్టేటస్ ఉంది. అందుకే అతను హీరోగా మారి '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమా చేశాడు. అది బాగానే ఆడింది. ఇప్పుడు రెండో సినిమాగా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చేశాడు. పవన్ కళ్యాణ్ సినిమా టైటిల్ పెట్టుకోవడం వల్ల.. కొంచెం బజ్ క్రియేట్ అయ్యింది.

కథ :
బైరిలంక అనే గ్రామం. అక్కడ ఓ తరంలో ప్రతి కుటుంబంలోనూ మగపిల్లలే జన్మిస్తారు. దాదాపు 60 మంది మగపిల్లల తర్వాత ఓ కుటుంబంలో అమ్మాయి పుడుతుంది. ఆమెనే రాజకుమారి (దీపికా పిల్లి). ఆమె పుట్టిన తర్వాత ఊరికి చాలా మంచి జరిగింది అని అక్కడి జనాలు భావిస్తారు. అందుకే ఆమెను పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటారు. ఆమె ఆ ఊరు దాటి వెళ్ళకూడదు అని డిసైడ్ అవుతారు.
ఒకవేళ ఆమె పెళ్లి చేసుకోవాల్సి వస్తే ఆ ఊరిలోనే 60 మంది అబ్బాయిల్లోనే ఎవరో ఒకర్ని ఆమె పెళ్లి చేసుకోవాలి అని డిసైడ్ అవుతారు. కట్ చేస్తే ఆ ఊరుకి బాత్రూమ్స్ నిర్మించే ప్రాజెక్టు కోసం సివిల్ ఇంజనీర్ కృష్ణ(ప్రదీప్ మాచిరాజు) వస్తాడు. అతనితో రాజా ప్రేమలో పడుతుంది. కృష్ణ కూడా ఆమెను ప్రేమిస్తాడు. కానీ వీరి ప్రేమకి ఊరి జనాలు ఒప్పుకున్నారా? తర్వాత ఏమైంది? అసలు కృష్ణ ఆ ఊరికే ప్రాజెక్టు పనిమీద ఎందుకు రావాల్సి వచ్చింది? వంటి ప్రశ్నలకి సమాధానమే మిగిలిన సినిమా.?

విశ్లేషణ :
ప్రదీప్ మాచిరాజుని హీరోగా పెట్టి సినిమా తీస్తున్నాం అంటే కొన్ని ఈక్వేషన్లు, కాలిక్యులేషన్లు ఉంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకునే సందీప్ బొల్ల, దర్శక ద్వయం నితిన్ %-% భరత్..లు ఈ కథని డిజైన్ చేసుకున్నారు. అలా అని కథలో కొత్తదనం ఏమీ లేదు..! కానీ ప్రదీప్ సినిమా అనేసరికి ఉండాల్సిన ఎలిమెంట్స్ ఏంటి? వేటిని డెలివరీ చేయాలి? అనే లెక్కలు బాగా వేసుకున్నారు.
ముఖ్యంగా ప్రదీప్ నుండి ఆశించే ఎంటర్టైన్మెంట్ మిస్ చేయలేదు. ఫస్ట్ హాఫ్ ను బాగా లాక్కొచ్చిన ఫీలింగ్ కూడా కలుగుతుంది. అయితే సెకండాఫ్ కి వచ్చే సరికి కొంచెం బోర్ కొడుతుంది. సరైన కాన్ఫ్లిక్ట్ పాయింట్ లేకపోవడం వల్ల కథనం ఎక్కడెక్కడికో వెళ్తున్నట్టు అనిపిస్తుంది. ఇలాంటి టైంలో క్లైమాక్స్ లో ఒక చిన్నపాటి ట్విస్ట్ వంటిది ఇచ్చి మమ అనిపించేశారు. ఇక టెక్నికల్ గా సినిమా రిచ్ గానే కనిపిస్తుంది. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ బాగుంది. ప్రొడక్షన్ వాల్యూస్ కి కూడా పేరు పెట్టాల్సిన పనిలేదు.

నటీనటుల విషయానికి వస్తే..
ప్రదీప్ మాచిరాజు టీవీ షోల్లో చేసినట్టే మంచి లైవ్ పెర్ఫార్మన్స్ ఇచ్చాడు. అతని కామెడీ టైమింగ్ ఫ్యామిలీ ఆడియన్స్ ని మెప్పించే అవకాశాలు ఉన్నాయి. కాకపోతే ఎమోషనల్ గా అతను ఇంకా ఎక్కడో మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది. దీపిక పిల్లి అందంగా కనిపించింది.స్క్రీన్ ప్రెజన్స్ పక్కన పెడితే.. నటనతో పెద్దగా మెప్పించింది లేదు. బ్రహ్మాజీ, సత్య, గెటప్ శ్రీను, కోదాటి పవన్ కళ్యాణ్ వంటి వాళ్ళ కామెడీ బాగా పేలింది. బ్రహ్మానందం, వెన్నెల కిషోర్..లు సర్ప్రైజింగ్ రోల్స్ పెద్దగా ఇంపాక్ట్ఫుల్ గా లేవు. మిగతా నటీనటులు వాళ్ళ పాత్రల పరిధి మేరకు నటించారు.

ప్లస్ పాయింట్స్ : ఫస్ట్ హాఫ్, కామెడీ, ప్రదీప్, ప్రొడక్షన్ వాల్యూస్

మైనస్ పాయింట్స్ : సెకండాఫ్ లో వచ్చే ల్యాగ్

మొత్తంగా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' లో 'పరుగు' 'మర్యాద రామన్న' వంటి పాత సినిమాల పోలికలు ఉన్నాయి. కానీ కామెడీ వర్కవుట్ అవ్వడం వల్ల టైం పాస్ చేయిస్తుంది. సెకండాఫ్ పై మేకర్స్ ఇంకాస్త శ్రద్ధ పెట్టి ఉంటే బాగుండేది.

---




టాలీవుడ్ దర్శకుడు గోపీచంద్ మలినేని బాలీవుడ్ డెబ్యూ మూవీగా 'జాట్' రూపొందింది. ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి మలినేని బాలీవుడ్ ఆడియన్స్ ని మెప్పించి హిట్టు కొట్టాడా? లేదా? అనేది ఈ రివ్యూ ద్వారా తెలుసుకుందాం రండి :

కథ..
మోటుపల్లి అనే ఊరు. అక్కడ రాణాతుగా(రణదీప్ హుడా) అనే రాక్షసుడు ఉంటాడు. ఆ ఊరు జనాలతో పాటు చుట్టుపక్కల ఉన్న 10 ఊర్ల జనాలను అతను చిత్ర హింసలకు గురిచేసి తరిమేస్తుంటాడు. ఎదురుతిరిగిన ప్రతి ఒక్కరినీ క్రూరంగా చంపేస్తూ ఉంటాడు.ఆధారాలతో అతన్ని అరెస్ట్ చేయడానికి ఏ మగ పోలీస్ అతని గుమ్మం తొక్కడు. కొంతమంది లేడీ పోలీసులు వెళ్తే.. వాళ్లపై అత్యాచారం చేసి తీవ్రంగా వేధిస్తూ ఉంటుంది అతని భార్య భారతి(రెజీనా). ఈ క్రమంలో వేరే ఊరుకి వెళ్తూ.. ట్రైన్ మధ్యలో ఆగిపోవడంతో అక్కడ టిఫిన్ చేయడానికి వెళ్తాడు జాట్ అలియాస్ బ్రిగేడియర్ బల్బీర్ ప్రతాప్ సింగ్(సన్నీ డియోల్). ఇంతలో రాణతూగా మనుషులు అక్కడికి వచ్చి.. అతను తింటున్న టిఫిన్ ను నేలపాలు చేస్తారు. దీంతో జాట్ కి కోపం వస్తుంది. సారి చెప్పమని అడుగుతాడు. కానీ విలన్ మనుషులు ఇతనికి ఎదురుగా వస్తారు. అందరినీ కొట్టుకుంటూ విలన్ ఇంటికి వెళ్తాడు హీరో. ఆ తర్వాత ఏమైంది? అసలు రాణతూగా ఊర్లో జనాలని ఎందుకు తరిమికొడుతున్నాడు. జాట్ ఎవరు? అతని బ్యాక్ గ్రౌండ్ ఏంటి? అనే ప్రశ్నలకి సమాధానమే మిగిలిన సినిమా.

విశ్లేషణ..
దర్శకుడు గోపీచంద్ మలినేని సినిమాల్లోని కథలు ఏమీ కొత్తగా ఉండవు. కథనం కూడా ప్రెడిక్టబుల్ గానే ఉంటుంది. కానీ ఫస్ట్ సీన్ నుండి లాస్ట్ సీన్ వరకు అతను మాస్ ఆడియన్స్ ను టార్గెట్ చేసుకునే సన్నివేశాలు రాసుకుంటాడు. 'జాట్' కి కూడా అతను ఇదే చేశాడు. ఇలాంటి కథ తెలుగులో మళ్ళీ తీస్తే.. ఇతనిపై ఓ రేంజ్లో ట్రోలింగ్ జరుగుతుంది. కానీ నార్త్ జనాలకి ఇలాంటి కథలు అంటే ఈ మధ్య తెగ నచ్చేస్తున్నాయి. సో వాళ్ళని ఇంప్రెస్ చేయడనికి మలినేని కొత్తగా ఏమీ చేయనవసరం లేదు. ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేసినట్టు కూడా లేదు అని ప్రతి సన్నివేశం చెబుతుంది. రొటీన్ గా అనిపించినా ఫస్ట్ హాఫ్ బాగానే ఎంగేజ్ చేసింది. కానీ సెకండాఫ్ కి వచ్చేసరికి తేడా కొట్టేసింది. హీరోయిజం కంటే విలన్ రూపంలో మలినేని సైకోయిజం ఎక్కువైపోయింది. రెండు, మూడు సీన్లకి తలలు నరకడం.. బుల్లెట్లు దింపడం, ఆడవాళ్ళ బట్టలు ఊడదీయడం. అటు తిప్పి ఇటు తిప్పి ఇవే సీన్లు. అయితే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో తమన్ రక్తికట్టించాడు. హీరో ఎలివేషన్ సీన్స్ కి అందరూ ఊగిపోయేలాగా కొట్టాడు. ఆ ట్యూన్లు కొత్తగా ఏమీ అనిపించవు. కానీ సింక్ అయ్యాయి అంతే. పాటలు అయితే ఒక్కటి కూడా గుర్తుండదు. ఫోన్ మాట్లాడటానికి బయటకి వెళ్ళడానికి స్కోప్ ఇచ్చినట్టు ఉన్నాయి. రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ బాగుంది. నిర్మాతలైన మైత్రి వారు బాగానే ఖర్చు పెట్టారు.

నటీనటుల విషయానికి వస్తే..
సన్నీ డియోల్ కి అక్కడ ఎలాంటి మాస్ ఇమేజ్ ఉందో అందరికీ తెలుసు. వాళ్ళని రంజింప జేసే విధంగా యాక్షన్ సీన్లు అయితే డిజైన్ చేశారు. కానీ ఆ సీన్స్ లో నటించడానికి సన్నీ బాగా కష్టపడ్డాడు. సరిగ్గా నిలబలేకపోతున్నట్టు క్లియర్ గా తెలుస్తుంది. కదలడానికి, ఉరకడానికి అయితే అతను ఎంత కష్టపడ్డాడో ప్రతి ఫ్రేమ్లోనూ కనిపిస్తుంది. కొన్ని సీన్లు చూస్తే.. అవి మన బాలయ్యకి అయితే భలే ఉంటాయి కదా, అతను ఇలాంటి సీన్లు అంటే ఎంతో ఎనర్జిటిక్ గా చేసేవాడు కదా అనే బాధ కూడా వేస్తుంది. హీరోకి హీరోయిన్ లేదు. చెప్పాలంటే అదొక రిలీఫ్ ఇచ్చే పాయింట్ ఇక్కడ. విలన్ రణదీప్ హుడాకి క్రాక్ లో కటారి కృష్ణ డ్రెస్సులు వేశారు. అతని భార్యగా చేసిన రెజీనాకి అదే క్రాక్ సినిమాలో జయమ్మ డ్రెస్సు తగిలించారు. అంతకు మించి వీళ్ళకి అట్రాక్షన్ ఏమీ లేదు. చెప్పాలంటే వీళ్ళకంటే సముద్రఖని, వరలక్ష్మి ఇంకా బాగా సెట్ అయ్యేవారు అనిపిస్తుంది. సినిమాలో చాలా మంది తెలుగు నటీనటులు ఉన్నారు. అజయ్ ఘోష్, జగపతి బాబు బాబు, రమ్య కృష్ణ, రచ్చ రవి.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా లిస్ట్ ఉంది. కానీ ఈ హిందీ సినిమాలో వాళ్ళు కొత్తగా చేసింది ఏమీ లేదు.

ప్లస్ పాయింట్స్ : ఫస్ట్ హాఫ్, ఎలివేషన్ సీన్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్

మైనస్ పాయింట్స్ : రొటీన్ కథ, సెకండాఫ్ లో వచ్చే సాగదీత, పాటలు, వయొలెన్స్

మొత్తంగా%ొ% 'జాట్' హిందీ వాళ్ళు యూట్యూబ్లో చూసి ఎంజాయ్ చేయడానికి బాగుంటుంది. టికెట్ పెట్టి థియేటర్ కి వెళ్లే రేంజ్లో అయితే ఇది ఉండదు. తెలుగు ప్రేక్షకులు సెకండాఫ్ స్టార్ట్ అయిన పావు గంటకే బయటకి వెళ్ళిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ  అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

# 13.4.2025 నుంచి 19.04. 2025 వరకు

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com





## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో నూతన మిత్రత్వాలు, స్నేహ సంబంధాలు అభివృద్ధి చెందుతాయి. ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి, ఇంతకుముందు ఇబ్బంది పెట్టిన వ్యక్తులు మిత్రులుగా మారడానికి అవకాశం ఉంది. బకాయి పడిన పాత రుణములు అందుకుంటారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వారం మధ్యలోతండ్రి యొక్క ఆరోగ్యం ఆలోచన చేస్తారు, మాటల వల్ల ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యమైన విషయాలు వాయిదా పడే అవకాశం ఉంది, మధ్యవర్తిత్వం పనికిరాదు, ఆర్థికవిషయాలు, ప్రయాణాలు,పరిచయాలు విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో కొంత అసంతృప్తిగా ఉన్నప్పటికీ ఆగిన పనులు పూర్తి చేయడానికి సంకల్పం తీసుకుంటారు, వృత్తిలో వ్యక్తుల స్వార్థపూరితమైన మనస్తత్వం మీకు చికాకును కలిగిస్తుంది. ఒత్తిడిని, నిద్రలేమిని కలిగిస్తూ సహనాన్ని కోల్పోయేలా చేస్తాయి. వృత్తి సంతానము సంబంధించిన అంశాలు వృత్తిపరంగా నూతన వ్యక్తులను కలుస్తారు గౌరవం పెరుగుతుంది, ఆధ్యాత్మిక వృత్తికి నూతన అవకాశాలు ఆధ్యాత్మిక ఆలోచనలు. ప్రయాణాల సంకల్పం. మిత్రులను బంధువుల్ని కలుస్తారు. భాగస్వామితో కలిసి కొన్ని నిర్ణయాలు వృత్తికి సంబంధించి, సంతాన అభివృద్ధికి సంబంధించి గట్టిగా తీసుకుంటారు.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

ఈ రాశి వారికి వారం ప్రారంభంలోఆరోగ్య శ్రద్ధ అవసరము రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తారు సంతానము వారి వృద్ధిపై మానసిక ప్రశాంతత తక్కువగా ఉంటుంది అధిక ఆలోచనలు చికాకును కలిగిస్తాయి. నూతన దీర్ఘకాలిక పెట్టుబడుల కొరకు, భూ సంబంధ అంశాల కొరకు తల్లితండ్రులను సంప్రదిస్తూ ఆలోచనలు చేస్తారు. ఆరోగ్య విషయాని నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించటం మేలు. భాగస్వామ్య వ్యవహారాల్లో రుణముల విషయంలో ఆకస్మిక ఖర్చులు.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో సంతాన అభివృద్ధి విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసు కుంటారు. వారి ఆరోగ్య విషయంలో, వ్యక్తిగత వృత్తిపరమైన విషయాలలో కొత్త ఆలోచనలు చేస్తారు. నూతన గృహ వాహనవిషయాలు, తల్లి ఆరోగ్యం, స్థిరాస్తులు, విద్యార్థులకు విద్యాసంబంధ విష యా లు, అనుకూలంగా ఉంటాయి. ఆలస్యంగా నైనా మీ ఆలోచనలుఫలిస్తాయి, అన్నదమ్ములతో, ముఖ్యంగా ఆత్మీయ మిత్రులతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వారం చివరిలో వ్యక్తిగత ఆరోగ్య విషయం మీద శ్రద్ధ తీసుకుంటూ వైరాగ్యపు ఆలోచనలని, నూతన పరిచయాల్లో, ఆత్మీయ సంబంధాల్లో అపార్థాలుని అధిగమిస్తూ ముందుకు వెళ్లాలి. రుణాలు చెల్లిస్తారు



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో కొలీగ్స్, క్రింద పనిచేసే వ్యక్తులు కొంతవరకు సహకరిస్తారు, మాటలతో అపార్థాలు రాకుండా చాకచక్యంగా వ్యవహరించాలినిర్ణయి సామర్థ్యం బాగుంటుంది, వృత్తిపరమైన బాధ్యత పెరుగుతుంది. తోబుట్టువులని సంప్రదిస్తారు. జీవిత భాగస్వామి సహకారంతో క్రొత్త ఆలోచనలు శ్రీకారం చుడతారు. వృత్తి చేయు ప్రదేశంలో వాహన సంబంధం అయిన విషయాలలో ఎక్కువ ఫోకస్ చేస్తారు. గృహ వాహన స్థిరాస్తి సంబంధ అంశాలు చర్చకి వస్తాయి.మానసిక ప్రశాంతత సామాన్యంగా ఉంటుంది. ఆలోచనలు సృజనాత్మకంగా లాభసాటిగా ఉంటాయి సంతానము అభివృద్ధి కరంగా ముందుకు వెళతారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామి సంతానంతో కలిసి ఆధ్యాత్మిక ప్రయాణాల కొరకు ఆలోచనలు, ప్రయత్నాలు చేస్తారు కుటుంబ వాతావరణ కొంచెం చికాకుగా ఘర్షణగా ఉంటుంది. మాటల వల్ల అపార్ధాలకు అవకాశం ఉంది శ్రద్ధ తీసుకోవాలి అనుకోని శత్రుత్వాలు చికాకును కలిగిస్తాయి. అనవసర ఆటంకాలతోపెట్టుకున్నపనులు, ప్రయాణాలు ముందుకు సాగవు. వారం మధ్యలో సామర్థ్యాలు పెరిగిన శక్తి మించి కృషి చేసిన ఇరుగుపొరుగు, తోబుట్టువులతో కొంత ఘర్షణాత్మకమైన అవకాశాలు అపార్థాలు అధికంగా ఉంటాయి. డ్రైవింగ్ చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలి వాహన విషయంలో గృహం విషయంలో చికాకులు



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో రహస్య శత్రువులు ఇబ్బంది పెట్టడానికి చేసే ప్రయత్నాల్లో, మీ నైపుణ్యాలతో అధిగమిస్తారు. సంతాన సంబంధం అభివృద్ధి కొరకు, భాగస్వామ్య వ్యవహారాలకు ఉద్వేగాలు లేకుండా నిదానంగా వ్యవహరించి పనులు సాధించుకోవాలి. ఆరోగ్య విషయంలో, వ్యక్తిగత అంశాలలో తగిన శ్రద్ధ అవసరం, అనవసర ఖర్చులు నియంత్రించుకో గలగాలి. జాగ్రత్తగా మాట్లాడుతూ, గౌరవం తగ్గకుండా, ఖర్చులు చేస్తూ, కుటుంబ సభ్యులతో వివాదములు రాకుండా ముందుకు వెళ్లాలి. ప్రయాణాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకదానికి అనుకున్న ఖర్చు మరొక దానికి అవ్వడం వల్ల కొంత చికాకులు ఉంటాయి.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ఈ రాశి వారికి వారం ప్రారంభంలోనూతన పరిచయాలు స్నేహ సంబంధాలు మొదలైన వాటికోసం ఖర్చులుచేస్తారు. భాగస్వామితో కలిపి కొత్త ఆలోచనలు చేస్తారు దీర్ఘకాలికి పెట్టుబడుల మీద దృష్టి కేంద్రీకరిస్తారు. కొంత నిద్రలేమి చికాకును కలిగిస్తుంది. నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి పౌరుషంగా తీసుకుంటారు. పుణ్యాలు పెంచుకుంటూ శత్రువుల మీద విజయం సాధిస్తారు. లాభదాయకమైన నిర్ణయాలతో ముందుకు సాగుతారు. విదేశాలలో ఉన్న సంతానము అభివృద్ధి కరంగా ఉంటుంది ఇష్టపడిన వ్యక్తులతో వాతావరణం సామాన్యంగా ఉంటుంది. వ్యక్తుల సహకారం అనుకూలంగా ఉంటుంది.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాడ 1వ పాదము

వారం ప్రారంభంలో స్థిరాస్తుల కొరకు చర్చలు. గృహ వాహనాలు అనుకూలంగా ఉంటాయి. మాట విలువ బాగుంటుంది. మిత్రులు సన్నిహితులు సహకరిస్తారు మనసు ఉల్లాసంగా ఉంటుంది. ఆధ్యాత్మిక విషయాలు సంబంధించిన అంశాలు ముందుకు సాగుతాయి. ఆగిన పనులు, వారం మధ్యలో పని ఒత్తిడితో భారం అధికంగా ఉంటుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడినవి చేస్తూ ముందుకు వెళ్లడానికి ప్రయత్నం చేయాలి, నూతన వృత్తులు కొరకు ప్రయత్నం చేసే వారికి దూర ప్రదేశాల్లో అవకాశాలు, ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలి. రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలి. రుణములు చెల్లిస్తారు.



## మకర రాశి

ఉత్తరషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరమైన అంశాలలో బాధ్యతలు శ్రమ అధికంగా ఉంటాయి మీ ఆలోచనలు నైపుణ్యాలు గౌరవాన్ని పెంచే విధంగా ఉంటాయి. కమ్యూనికేషన్ విషయములలో జాగ్రత్తలు అవసరం. వ్యక్తుల సహకారం కొంత ఉండడం వల్ల ప్రశాంతత తక్కువగా ఉంటుంది. వారం మధ్యలో మీ ఆలోచనలు ఫలిస్తాయి, సంతానం అభివృద్ధికరంగా ముందుకు సాగుతుంది, ఆత్మీయులైన వ్యక్తులతో అభిప్రాయ బేధాలు లేకుండా ముందుకు పెడతారు. ఆర్థిక సంబంధమైన, భూ సంబంధ విషయాలు అనుకూలం. తండ్రి సహకారం బాగుంటుంది. సంతాన సంబంధ అంశాలలో అభివృద్ధి విషయాలలో పెట్టుబడులు.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతబిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ఆధ్యాత్మిక విషయాలలో మిత్రులు కొలీగ్స్‌తో కలసి దగ్గర ప్రయాణాలు, పెద్దలు గురువులను కలుస్తారు వారి ఆశీస్సులు తీసుకుంటారు. కుటుంబంలో కార్యక్రమ కొరకు తండ్రి ఆర్థిక సహకారంతో ముందుకు వెళతారు. తల్లిదండ్రుల సౌకర్యం కొరకు వారి ఆరోగ్యము పై ఆలోచనలు అధికం చేస్తారు, వృత్తిపరమైన విషయాల్లో బాధ్యతలు అధికంగా ఉంటాయి. శ్రమపడినా శ్రమకి తగిన గౌరవం, ఆర్థిక లాభాలు అన్నప్పటికీ వ్యక్తులతో విభేదాలు అభిప్రాయ బేధాలు రాకుండా ముందుకు సాగాలి. వృత్తిపరమైన అంశాలలో ఆలస్యాలు ఆటంకాలు వాహన సంబంధమైన విషయాలు ఇబ్బందులు



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాబాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

రాశి వారికి వారం ప్రారంభంలోవిద్యాపరమైన విషయాలలో దూర ప్రయాణాలు, విదేశీ విద్య మిత్రుల ప్రోత్సాహంతో ముందుకు ప్రయత్నాలు చేస్తారు. ఆరోగ్యములో జాగర్తలు. కమ్యూనికేషన్, ప్రయాణాలు విషయంలోఇబ్బందులు, ముఖ్యమైన ఆత్మీయులైన వ్యక్తులు అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త పడాలి. ఆకస్మిక లాభాలు సమానంగా అనవసరమైన ఖర్చులు చికాకునుకలిగిస్తాయి. శ్రమకు తగిన గుర్తింపు గౌరవం, సామాజిక సేవ చేస్తారు. వృత్తి సంబంధమైన విషయాలు కొంత ఒత్తిడితో కూడిన గౌరవాన్ని, అధిక బాధ్యతల్ని తెస్తుంది. భాగస్వామ్య వ్యవహారాల్లో ఉద్వేగాలకు లోను కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.


అమలాపాల్